


# ప్రియురాలు పిలిచె

## – డా.యండమూరి వీరేంద్రనాథ్



### (గత సంచిక తరువాయి)

''ఇదంతా ఇంపెర్సనేషన్ క్రింద వస్తుందని తెలీదా?''

''మేము... మేము ఇదంతా ఏదో సరదాగా చేశాము.''

''సరదాగా చేశారా?'' కుర్చీ వెనక్కు కొడుతూ ఆవేశంగా లేచాడు కళ్యాణ్‌సింగ్.

''మీరు సరదాగా చేసింది ఒక మనిషిని మరణం అంచులకి తీసుకెళ్ళింది. అతని శరీరాన్ని మంచు తినేసింది. ఇప్పుడు చావు బ్రతుకుల మధ్య కొట్టు మిట్టాడుతున్నాడు. ఇదేమన్నా కాలేజీలో రాగింగ్ అనుకున్నారా? అయినా ఒక మనిషిని అర్ధరాత్రి మంచు తుఫానులో బయటకు తోసెయ్యటానికి మీకు మనసెలా వప్పింది. అసలు మీరు మనుష్యులేనా?''

''కానీ సర్...''

''నో. నేనింకేమీ వినదల్చుకోలేదు. మిస్టర్ గోవింద్ యూ ఆర్ అండర్ అరెస్ట్ ఫర్ ఇంపెర్సనేషన్ అండ్ చీటింగ్.''

రొప్పుతూ వస్తూన్న క్లాస్‌మేట్‌ని చూస్తూ అమ్మాయిలు ఏం జరిగిందని అడిగారు.''గోవింద్‌ని పోలీసులు అరెస్టు చేశారు'' అన్నాడు. వాళ్ళు దిగ్భ్రాంతులయ్యారు. ''అవును. ఇప్పుడే హోటల్ నుంచి తీసుకెళ్ళారు. మనం రూము ఖాళీ చేయించినతను పోలీసులకి రిపోర్టు చేసినట్టున్నాడు. వాడు ఇక్కడ కమీషనర్ ఆఫ్ పోలీసుకి దగ్గరనుకుంటాను. హోటల్ దగ్గర పోలీసులు మనకోసం వెయిట్ చేస్తున్నారు''.

అమ్మాయిల మొహంలో బెదురు స్పష్టంగా కనిపించింది. "ఇప్పుడెలాగే? ఊరు కాని ఊళ్ళో పోలీస్ లాకప్‌లో...'' ఏడుస్తూ అంది ఒక అమ్మాయి.

''కొళాయి విప్పకు'' అంది అనూజ్ఞ విసుగ్గా. ''మనమేం తప్పు చేశామని? ప్రిన్సిపాల్ మన కోసం రెండు రూములు బుక్ చేస్తే పోలీసులు రికమెండ్ చేశారని మనది కాన్సిల్ చేసి అతని కిచ్చాడు. న్యాయబద్ధంగా మన రూము. నాటకమాడి తిరిగి దాన్ని సంపాదించుకున్నాం. అంతేగా.''

''కానీ అతను తన పలుకుబడి ఉపయోగించి, అదే పోలీసులతో మనల్ని అరెస్టు చేయిస్తున్నాడు. మన మీద ఏమేం కంప్లయింట్స్ ఇచ్చాడో ఏమో.''

అనూజ్ఞ స్నేహితురాళ్ళతో సహా హోటల్‌కి వచ్చేసరికి క్లాస్‌మేట్ చెప్పినట్లు అక్కడ పోలీసులు లేరు (అయితే అక్కడ పోలీసులు లేకపోవడానికి అసలు కారణం వేరు). అమ్మాయిలు తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నారు. మళ్ళీ అల్లరి మొదలైంది. ''మనం రూమ్ ఖాళీ చేయించినతను మంచి స్మార్ట్‌గా ఉన్నాడు కదూ'' అంది ఓ అమ్మాయి.

''స్మార్టా! నా మొహం స్మార్టు. నోట్లో వేలు పెడితే కొరకలేనంత అమాయకంగా ఉన్నాడు'' అంది మరొక అమ్మాయి. ''బెంగాలీ అనుకుంటా. లాల్చీ వేసుకుని భుజానికి సంచి తగిలించుకున్నాడుగా!'' అని ఎవరో అన్నారు.

ఆ టైమ్‌కి హమాలీ టీ సర్వ్ చేస్తున్నాడు. ''కాదు. ఆయన తెలుగు. ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చారు'' అన్నాడు. అతను అప్పటివరకూ వాళ్ళమాటలు నిశ్శబ్దంగా వింటున్నాడు. లోలోపల గుండె రగిలిపోతోంది. ఇక ఉండబట్టలేక ''మీరనుకున్నట్టుగా ఆయన మామూలు మనిషికాదు. పెయింటర్. ఆయన వేసిన బొమ్మ మీరు చూశారా? చూస్తే ఇలా ఎగతాళిగా మాట్లాడుకోరు. నేను టీలు సర్వ్ చేసే కుర్రాడిని. నా పట్లకూడా ఆయన ఎంతో ఆదరంగా మాట్లాడారు. మీరనుకున్నట్లు ఆయన వెళ్ళి పోలీసులకి చెప్పలేదు. అసలు పోలీసుల వరకు ఎందుకు? గట్టిగా దెబ్బలాడి ఉంటే మా మేనేజరే రూమ్ తిరిగి ఇచ్చి ఉండేవాడు. మంచితనంగా వెళ్ళిపోయి మంచులో కూరుకుపోయాడు. నేనే బయటకు లాగి ఆయన్ని ఆస్పత్రిలో చేర్పించాను'' అనేశాడు.

అక్కడున్న వాళ్ళ మొహాల్లో నెత్తురు చుక్క లేదు. హమాలీ అందరి వైపూ చూసి, ''ఆయన జేబులో పోలీస్ కమీషనర్ అడ్రసుంది. అది చూసి డాక్టర్లే కమీషనర్‌ని పిలిచారు. ఆ తరువాత మొత్తం చేసిందంతా కమీషనరే. అసలు జరిగినదేమిటో కమీషనర్‌కి చెప్పింది మాత్రం నేను!'' గర్వంగా అన్నాడు.

ఆ గదిలో చీమ చిటుక్కుమంటే వినపడేంత నిశ్శబ్దం. అంతలో గుమ్మం దగ్గర చప్పుడవటంతో అందరూ అటు చూశారు. గోవింద్ లోపలికి వస్తున్నాడు.

## 7

''**ఇంకొంచెం** సేపట్లో నేను వెళ్ళిపోవచ్చా డాక్టర్‌గారూ'' కార్తికేయ అడిగాడు. ''ఇంకో గంటలో నేషనల్ పోటీలు మొదలవుతాయి.''

''మీరు బలహీనంగా ఉన్నారు.''

''ఫర్వాలేదండీ. చేతివేళ్ళు తప్ప మిగతా అంతా స్వాధీనంలోనే ఉంది.''

''ఫ్రాస్ట్‌బైట్ ప్రభావం అది. ఇంకో అరగంట ఆ మంచులో అలాగే ఉంటే ఆపరేషన్ చెయ్యవలసి వచ్చేది. ఫ్రాస్ట్‌బైట్ చాలా భయంకరమైనది.''

''అదృష్టం మా హమాలీ రూపంలో వచ్చి రక్షించిందన్నమాట'' నవ్వాడు కార్తికేయ. ''మరి నే వెళ్ళిరానా?'' అన్నాడు.

‘‘ఒక్క నిముషం’’ అంటూ డాక్టరు అప్పుడే వచ్చిన ఎక్స్‌రే చూశాడు. సంతృప్తిగా ‘‘ఓకే. అంతా క్లియర్‌గానే ఉంది. మీరు వెళ్ళవచ్చు. మీ వేళ్ళు నయం కావడానికి మాత్రం పది పదిహేను రోజులు పట్టవచ్చు. బరువైన పనులేవీ చేయకండి.’’

‘‘అలాగే’’ కార్తికేయ బయట కొచ్చేసరికి పోలీసు జవాన్లు రెడీగా ఉన్నారు. సామాన్లు వాళ్ళకిచ్చి కలిసి బయల్దేరాడు.

‘‘ఏదో పనిమీద కమీషనర్‌గారు అర్జెంటుగా కసౌలి. వెళ్ళారు సార్. మిమ్మల్ని రేపు కలుస్తారట’’ అన్నాడు జవాను. సిమ్లాకి రెండొందల కిలోమీటర్ల దూరంలో ఉన్న ‘కౌశాలి’ రాముడి తల్లి అయిన కౌసల్య పుట్టిన ఊరుగా చెప్పుకుంటారు. దశరథుడి పెద్ద అత్తగారి ఇల్లన్నమాట.

‘‘సిమ్లా మీ కింత అమర్యాద పూర్వకంగా స్వాగతం చెప్పినందుకు సారీ’’ అంటూ క్షమాపణలు చెబుతూ హోటల్ మేనేజర్ తాళం ఇచ్చాడు. మళ్ళీ అతని రూమ్ అతనికి ఇవ్వబడింది. తాళం తీస్తూంటే తెలిసింది. చేతి వేళ్ళ నొప్పి, అంత బాధలోనూ అతడికి ఆశ్చర్యం అనిపించింది. ఇంత కర్కశంగా శరీరాన్ని చీల్చే ‘మంచు’ పైకి ఎంత అమాయకంగా కనబడుతుంది..! ‘ప్రేమ కూడా అంతే కదా. ఎంత మధురంగా కనబడుతుందో అంత కర్కశంగా మనసుని చీలుస్తుంది’ అనుకున్నాడు.

రూమ్‌బాయ్ లైట్ వేసి, సామాన్లు లోపల పెట్టి వెళ్ళిపోయాడు. కిటికీ సందుల్లోంచి గాలి లోపలికి బలంగా కొడ్తోంది. ఆ వేగానికి బల్లమీద రెపరెపలాడుతున్న ఓ కాగితం, దానిమీద పేపర్‌వెయిట్‌లా ఓ గులాబీ పువ్వు...! అతడు ఆశ్చర్యపోతూ దాన్ని తీసుకుని చదివాడు.

**కార్తికేయగారికి,**

*నమస్తే, నా పేరు అనూజ్ఞ. మీ పేరెలా తెలిసింది అని ఆశ్చర్యపోతున్నారా? మిమ్మల్ని రూమ్‌లోంచి ‘వెళ్ళగొట్టిన’ దాన్ని. నాకు మీ పేరు తెలియకుండా ఎలా ఉంటుంది. మీరు తెలుగువాళ్ళేకదూ. మేమూ అంతే. ఉద్యోగరీత్యా (క్షమించాలి మా నాన్నగారు మంత్రి కాబట్టి రాజకీయ రీత్యా అనాలేమో) ఢిల్లీలో ఉంటున్నాం. ఇంతకీ ఏం చెపుతున్నాను. ఇప్పుడు మీకీ ఉత్తరం వ్రాయడానికి కారణం మీకు క్షమాపణలు చెప్పుకోడానికి కాదు. అవును. నిజంగా అందుక్కాదు. ఇట్సాల్ ఇన్ ది గేమ్. మీరు సామాన్లు తీసుకుని హోటల్‌లోంచి తల వంచుకొని వెళ్ళిపోతోంటే మేము కోతుల్లా స్థంభాల వెనకాల్నుంచి నవ్వుకుంటూ చూశాము. దురదృష్టవశాత్తు అది భయంకరమైన పరిణామాలకి దారితీసింది. అది వేరే సంగతి. పోతే నేనీ ఉత్తరం వ్రాయడానికి కారణం ఆ తరువాత మీ ప్రవర్తన గురించి.*

*పోలీసుల్నించి బయటపడిన మా గోవింద్ మీ గురించి చెప్పాడు. మీరు కల్పించుకుని కళ్యాణ్‌సింగ్‌గారికి (మమ్మల్ని వదిలెయ్యమని) నచ్చచెప్పిన విధానం అతను మాకు వివరిస్తుంటే నా ప్రవర్తనకి నేనే సిగ్గుతో చచ్చిపోయాను. ‘చిన్నపిల్లలు, వాళ్ళు చెయ్యకపోతే అల్లరి ఇంకెవరు చేస్తారు. పోనివ్వండి’ అన్నార్ట మీరు. మీరు మంచు తుఫానులో ఇరుక్కుపోయారని తెలిసింది మాత్రం ఇప్పుడే. నిజం. ఒట్టు. అయినా మీక్కోపం రాలేదా గురూజీ. ఇదిగో ఇక్కడే పడిపోయాను నేను. ఆఁ! మీ*

*ప్రవర్తన చూస్తే నాకు గేబ్రియల్ ఒకారా వ్రాసిన గేయం గుర్తొచ్చింది. మీరు ఆ కోవకి చెందిన ఆదిమానవులు(కోపం తెచ్చుకోకండి) అనిపించింది.*

**అనగనగా — అప్పుడెప్పుడో వాళ్ళు అద్భుతంగా నవ్వేవాళ్ళు.**

**వాళ్ళ మనసులు నవ్వేవి. కళ్ళు పలకరించేవి.**

**ఇప్పుడు పెదవుల చివర్లతో నవ్వుతున్నారు.**

**అప్పుడు హృదయంతో కరచాలనం చేసేవారు. ఇప్పుడు చేతుల్తో చేస్తున్నారు**

**కానీ – నన్ను నమ్మరా కన్నా! నాకు నీలా నవ్వాలని ఉంది. నీ వయస్సులో నేనున్నప్పుడు నేనెలా నవ్వేవాడినో మళ్ళీ నాకలా నవ్వడం నేర్పవూ ?**

*బావుందా గురూజీ? నా వచ్చీరాని తెలుగులో వ్రాసుకున్నాను. మా అమ్మ అంటూ ఉంటుంది. 'సత్‌జన సాంగత్యం చేయవే కాస్తన్నా బాగుపడతావు' అని. అందుకని మీరు మమ్మల్ని క్షమించేసి మాతో ఒక కప్పు టీ సేవిస్తే సజ్జన సాంగత్యం లభిస్తుంది. (మీక్కాదు మాకు). చెప్పండి మాస్టారూ. ఇటీవల సాహిత్యంలో మాస్టారు, నేస్తం, మిత్రమా ప్రయోగాలు చాలా ఎక్కువై పోయాయట. అవి మనకొద్దులెండి. చాలామంది ప్రేయసీ ప్రియులు పుంఖాను పుంఖాలుగా వాటిని వాడేసుకుంటున్నారు. మీకొక కప్పు ఛాయ్ ఫ్రీగా త్రాగాలనిపిస్తే ఈ గులాబీ స్వీకరించండి. మాలాంటి కోతుల్తో స్నేహం ఇష్టం లేకపోతే ఈ గులాబీ గుమ్మంలోంచి బయటకు విసిరేయండి. కానీ ఒక్క విషయాన్ని మాత్రం గుర్తుంచుకోండి. శీతాకాలంలో సిమ్లాలో ఒకమ్మాయి టీకి పిలిస్తే శ్రీశ్రీ కూడా "...మరో టీ కప్పు– మరో టీ కప్పు– మరో టీ కప్పు పిలిచింది. పదండి ముందుకు పదండి తోసుకు పోదాం పక్క రూమ్‌కి. కనపడలేదా సాసరు పైకప్పులో భగ భగ భుగ భుగ త్రేనీరు. ఎముకలు క్రుళ్ళిన వయస్సు మళ్ళిన సోమరులారా చావండి! నేను వెళ్తున్నాను ఆరూమ్ పక్కకి, టీ కప్పుకి..!" అంటూ మహాప్రస్థానాన్ని మారోలా ప్రస్తావించేవాడు. అది అమ్మాయి గొప్పతనం కాదు. టీ గొప్పదనం. రండీ... ప్లీజ్.*

**–అనూజ్ఞ**

అతడు కుర్చీ వెనక్కు వాలి నవ్వాడు. నిజంగానే నవ్వాడు. గట్టిగా, గుండెలంచుల్ని సంతోషం తట్టగా. అది సంతోషం కాదు. చిన్నపిల్లాడు అల్లరి చేస్తున్నప్పుడు చూస్తుంటే వచ్చే ముచ్చటైన నవ్వు. ఉత్తరం జాగ్రత్తగా మడత పెట్టి, దాన్ని మంచం పక్కన పెట్టి దానిమీద గులాబీ పెట్టి లేచాడు.

'థాంక్స్' అని గుమ్మం దగ్గర్నుంచి వినబడింది. ఉలిక్కిపడి తలెత్తాడు. ఆమె నవ్వుతూ ''వస్తున్నారనేగా'' అంది. అతడు వెంటనే జవాబు చెప్పలేదు. ఆమెని వెలుతుర్లో చూడడం అదే మొదటిసారి. అతనిలో చిత్రకారుడు చప్పున మళ్ళీ మేల్కొన్నాడు. కవినీ, చిత్రకారుడ్నీ సంతృప్తి పరిచే అందం ఆ అమ్మాయిది. అది సెక్స్ కాదు. కదిలినప్పుడల్లా ఆమె కళ్ళు కవిత్వం చెపుతున్నట్టు ఉన్నాయి. ఆమె కనెప్పలు రెండు పూరేకుల్లో అల్లరినంతా కుక్కేసి కుట్టేసినట్టున్నాయి.

సౌందర్యం ఇంద్ర చాపమవటం అదే. కవుల పెన్నులోకి, కళాకారుల వెన్నులోకి ఒకేసారి ప్రవహించి బాధించటం. ధమనుల మధ్య వ్యథ పెరిగి, సిరలో రక్తం సిరాగా మారి, గుండె అక్షరమై కాగితం మీదికి జారిపోవడం... అదీ రచయిత బాధ! కుంచె అంచుల్తో అందం కొసల్ని జాగ్రత్తగా పట్టుకుని కేన్వాసు పల్లకి ఎక్కించడం చిత్రకారుడి బాధ! ఇక కవి బాధ మరింత కష్టం. ఒక వాక్యంలో చెప్పేస్తే అతడు కవి ఎందుకు అవుతాడు? చెక్కిళ్ళు చంపకమాలలా తేటగా, ఉరువులు ఉత్పలమాలలా ప్రేరకంగా, నాసిక వచన గేయంలా పొడుగ్గా, పెదవులు వృత్తంలా గుండ్రంగా, వంపులు మత్తేభంలా మెలికలు తిరుగుతూ, శరీరమంతా సీసపద్యంలా పైన సన్నగా, తేటగీతిలా క్రింద కుదురుగా... ఇంత చెప్తే గానీ ప్రబంధకవికి సంతృప్తి ఉండదు.

ఆ అమ్మాయిని చూడగానే అతనికి అనిపించిన తొలి భావం– **ఒక సాయంత్రం రబ్బరు పెన్సిల్ ఎక్కడో విసిరేసుకుని – చదివిందంతా బళ్ళోనే పారేసుకుని – అలసిన కళ్ళతో దుమ్ముకళ్ళతో – కిలకిల్లాడుతూ దార్లో ఎదురైన పసిపిల్లకి సడన్‌గా ఇరవై ఏళ్ళొచ్చేస్తే... అలా ఉంది ఆ అమ్మాయి.**

''ఏంటి గురూజీ? షేక్స్‌పియర్ టుబి నాట్ టుబి లా మా గదికి రావాలా వద్దా అని ఆలోచిస్తున్నారా? లేకపోతే 'దిల్ హైకి మాన్‌తా నహీ' అన్న పాట గుర్తు తెచ్చుకుంటున్నారా? పదండి – పదండి. బైదిబై నా పేరు అనూజ్ఞ'' అంటూ అతడిని తీసుకెళ్ళింది.

అరగంటసేపు కబుర్లు. అతన్ని మాట్లాడనివ్వలేదు. అంతా వాళ్ళే మాట్లాడారు. 'మాదేం తప్పులేదు గురూజీ. మా రూమ్ మీ కిచ్చేశాడు ఆ మేనేజర్ బకాసురుడు' అని నామ్‌కే వాస్తే చిన్న క్షమాపణ చెప్పేసి, తరువాత ఫ్రాస్ట్‌బైట్ అంటే ఏమిటో వివరాలు తెలుసుకుని, పికాసోనీ మోనలిసానీ పోల్చి జోకులేసుకుని, వాళ్ళలో వాళ్లే ఏవేవో మాట్లాడేసుకుని అతడిని పూర్తిగా ప్రేక్షకుడిని చేసి అరగంట తరువాత వదిలిపెట్టారు.

అతడితోపాటు ఆ అమ్మాయి కూడా గదికి వచ్చింది.

''మీ వయసెంత?'' అకస్మాత్తుగా ఆ అమ్మాయి అడిగిన ప్రశ్నకి బిత్తరపోయి ఎందుకని అడగబోయి చెప్పాడు.

''ప్చ్'' అంది. ''మిమ్మల్ని మరీ గురూజీ అని పిలుస్తోంటే ఏదో టీవీ భారతంలో ద్రోణాచార్యుడిని పిలిచినట్టుంది. మాస్టారు. మిత్రమా వద్దనుకున్నాంగా, ఇంకేదైనా సంబోధన కాయిన్ చెయ్యాలి. ఏం చేస్తే బావుంటుందబ్బా? గుడ్– 'మిత్రాజీ' అంటాను. బావుందా?''

అతడు సమాధానం చెప్పలేదు.

''అన్నట్టు మీ పెయింట్స్ చూపిస్తారా? అదే రేపు పోటీలో పెట్టబోయేది.''

అతడు పెయింటింగ్స్‌కి ఉన్న కాగితం అడ్డు తీయబోయాడు. కొంకర్లయిన వేళ్ళు నొప్పి పుట్టాయి. అతడి బాధ గమనించి ఆమె అందుకొని విప్పుతూ అంది. ''మా గురించి మీరింకో పదిరోజులు ఈ వేళ్ళతో బాధపడాలి. బైదిబై నేను మాటిమాటికీ 'క్షమించండి' అనడం, మీరు 'ఫర్వాలేదులే' అనడం బాగోదు కదా.''

''అవును. బాగోదు'' అన్నాడతను.

''అందుకే అనడం లేదు'' అని నవ్వుతూ ఆమె చివరిముడి విప్పుతూ కాగితాల్లోంచి పెయింటింగ్స్‌ని తీసింది.

కొమ్మ వెనుకనుంచి కొండచిలువ వచ్చినట్టు ఒక్కసారిగా అతడు నిరుత్తరుడయ్యాడు.

రాత్రి తుఫాను తాకిడికి ఆ పెయింటింగ్‌లో రంగుల్ని, మంచు తినేసింది.

ఫ్రాస్ట్‌బైట్ అతడిని చంపటం కాదు, మంచు అతడి బొమ్మల్ని చంపేసింది. అతడి మొహం కూడా ఆ పెయింటింగ్స్‌లాగే తెల్లగా పాలిపోయింది.

బాధ బహుమతి గురించి కాదు. పచ్చటి పొలాలు, పచ్చిక బయళ్ళు, స్వేచ్ఛగా పచ్చిక మేస్తున్న పశువుల మందలు, ఆ మందల్ని అదిలిస్తున్న కుర్రకారు, కొడవళ్ళతో గడ్డి కోస్తున్న పల్లె పడుచులు, పొలాల పక్కన ఏతాము. పల్లెముఖం పట్టిన ఎడ్లబళ్ళు, ఆ బళ్ళ చక్రాలవల్ల గాట్లుపడ్డ రోడ్డు. పక్కనే నీటిగుంటలు, చెరువులు. వాటిల్లో మునిగి మోరలు సాచే పశువులు. కప్పల్లా గెంతే పిల్లకారు. ఆ పైన ఆకాశంలో కొంగలబారు. అంతా... అన్నీ... ఒక్క ఆటంబాంబు పడి సర్వనాశనమైపోతే...

అవన్నీ నాశనమైనందుకు కాదు బాధ. వాటితోపాటు పోకుండా తను మిగిలినందుకు. అదీ బాధ.

అనూజ్ఞ నెమ్మదిగా అతని దగ్గరకి వచ్చింది. అతడింకా షాక్ నుంచి తేరుకోలేదు.

''ఇది... ఇదింక పనికిరాదు కదా'' బొమ్మవైపు నిస్సహాయంగా చూస్తూ అంది. అతను మాట్లాడలేదు. బ్లాంక్‌గా చూస్తూనే ఉన్నాడు. తన ఎమోషన్స్‌ని కంట్రోల్ చేసుకోవటానికి ప్రయత్నిస్తూ ''ఇదంతా నా వల్లే – నిజంగా నా వల్లే – ఛీ... ఇలా ఎందుకు జరిగింది? జరక్కపోతే ఎంత బావుణ్ణు– ఇప్పుడేగా జోకు వేశాను. నేను క్షమించమని అడగటం, మీరు ఫర్వాలేదులే అనటం ఎందుకని...'' అంది. ఆమె కళ్ళల్లో నీళ్ళు స్పష్టంగా కనబడ్డాయి. ''... ఇప్పుడది క్షమించమని అడగటానిక్కూడా వీల్లేనంత పెద్దది. ఘోరమైనది. నాకే... నాకే'' మాటలు రాక ఆ అమ్మాయి చిన్నపిల్లలా ఏడ్చేసింది.

ఆమె దుఃఖం హృదయంలోంచి వచ్చింది. గుండె లోతుల్లోంచి వచ్చింది. అతడు ఆమెని ఓదారుస్తున్నట్టు ''ఊరుకో, ఊరుకో అనూజ్ఞా. ఇప్పుడేమయిందని?'' అన్నాడు.

ఆమె పెదవులు బిగపట్టి ఏడుపు ఆపుకోవటానికి ప్రయత్నిస్తూ ''ఏమవలేదా? ఏమీ అవలేదా?'' అంది.

తనకన్నా ఆమె ఎక్కువ వ్యథ చెందటంతో అతడు అనునయిస్తున్నట్టు ''...వచ్చే సంవత్సరపు పోటీల్లో పాల్గొంటాను. అంతేగా?'' తేలిగ్గా కనపడటానికి ప్రయత్నిస్తూ అన్నాడు.

‘‘పోటీలా? పోటీలో వచ్చే పదివేల కోసమా? నిజంగా అంతేనా? నిజం చెప్పండి. ఎన్నాళ్ళు వేసి ఉంటారో ఈ బొమ్మని! ఈ నష్టం అన్నాళ్ళు వేస్టయినందుకా? ఆ రోజుల లెక్కలోనా...? కాదు. నిజంగా కాదు. నేను బాధపడతానని మీరు మామూలుగా ఉండటానికి ప్రయత్నిస్తున్నారు. నాకు తెలుసు. దీన్ని వేయటానికి మీరెంత కష్టపడి ఉంటారో నాకు తెలుసు. నన్ను తిట్టండి. కొట్టండి. మీరలా మామూలుగా ఉంటే నేను భరించలేను...’’ ఆమె హిస్టీరిక్‌గా ఏడుస్తుంటే అతను కదిలిపోయాడు. అతడి బాధ అఖాతంకన్నా ఎక్కువే. కానీ ఆమె బాధ ప్రకటితం.

‘‘చూడూ. నేను ఇంకో బొమ్మ వేసుకుంటాను. ఇంతకన్నా బాగా వేస్తాను. సరేనా’’ అన్నాడు. ఆమె నెమ్మదిగా తలెత్తింది. కిటికీ వెలుతురు కంటి చుక్క మీద ప్రతిబింబించి మెరుస్తూండగా, ‘‘నిజంగా?’’ అంది.

‘‘నిజంగా’’ అన్నాడు.

‘‘నామీదొట్టు?’’ ఏడుపు మర్చిపోయి అడిగింది. అంత బాధలోనూ అతడికి నవ్వొచ్చింది. ‘ఒట్టు’ అన్నాడు. ఆమె చప్పున కుర్చీలో కూర్చుని ‘అయితే వెయ్యండి’ అంది. ‘ఏమిటి ఒట్టా’ అన్నాడు. ‘కాదు బొమ్మ’ అంది. అతడు అదిరిపడి ‘ఇప్పుడా?’ అన్నాడు.

‘‘ఇప్పుడే.’’

‘‘చూడూ నీకు బొమ్మల గురించి ఏమీ తెలియదనుకుంటాను. దానికి మూడ్ కావాలి. రోజుకి రెండు మూడు గంటలపాటు వేసినా వారం పది రోజులు పడుతుంది.’’

‘‘అంటే ముప్పై గంటలు! ఇంకో గంటలో ఎగ్జిబిషన్ స్టార్ట్ అవుతుంది. కానీ జడ్జీలు చూసేది రేపు సాయంత్రం. అంటే ముప్పైకన్నా ఎక్కువ గంటలే టైముంది. ముందీ బొమ్మ ఎగ్జిబిషన్లో పెట్టేద్దాం. తరువాత దీన్ని మార్చేసి కొత్తది రీప్లేస్ చేద్దాం’’ తనలో తనే మాట్లాడుకుంటున్నట్టు ఆమె గబగబా అనేసింది.

చిన్నపిల్లాడిని కాశ్మీర్ తీసుకువెళ్తే ఆ తెల్లటి మంచుకొండల్ని చూస్తూ ‘‘...అమ్మా అమ్మా... కొండెక్కి అటేపు ఏముందో వెళ్ళి చూద్దామే’’ అన్నంత సులభంగా ఆ అమ్మాయి చెప్పేస్తూ ఉంటే అతడు అవాక్కై చూశాడు.

‘‘లేవండీ... వెళ్ళి కేన్వాసూ, రంగులూ కొనుక్కొద్దాం’’.

‘‘నీకు నిజంగా మతిపోయింది. రేపు సాయంత్రంలోగా బొమ్మెలా వేస్తాను? నాకు మూడు నాలుగు నెలలు పడుతుంది.’’

‘‘మరి ముప్పై గంటలన్నారు?’’

‘‘ఆఫీసులో కూర్చుని చేసినట్టు చేస్తే ముప్పై గంటలు. కానీ ప్రతిరోజూ వెయ్యను. నాలుగైదు రోజుల కొకసారి ఒకటి రెండు గంటలు వేస్తాను. ఒకోసారి కేవలం చిన్న స్ట్రోకు వేసి ఊరుకున్న రోజులు కూడా ఉంటాయి. అదంతా నీకు అర్థం కాదులే.’’

ఆమె దాన్ని పట్టించుకోకుండా ''రోజూ ఎందుకు వెయ్యరు?'' అని అడిగింది.

''ఇది క్రియేటివిటీ కాబట్టి. దీనికి మూడ్ ఉండాలి కాబట్టి. అంతేకాని మూడు రోజుల కొకటి చొప్పున ఏడాదికి నూరు బొమ్మలు వేయటం కుదర్దు.''

''నేను మూడ్ తెప్పిస్తాను.''

''ఎలా తెప్పిస్తావు?''

ఆమె కుర్చీలోంచి లేచి నాటకీయంగా ''ప్రతి మగవాడి విజయం వెనుకా ఒక స్త్రీ ఉంటుంది. మీ వెనుక...'' అని ఆగి– ''మీ వెనుక ఫోన్ మ్రోగుతోంది'' అంది. అతడు రిసీవర్ ఎత్తి ''హల్లో'' అన్నాడు.

''హల్లో– నేనూ కళ్యాణిని. ఎలా ఉంది సిమ్లా? ఎగ్జిబిషన్ మొదలైందా?''

''ఇంకో గంటలో మొదలవుతుంది'' అని ఆగి, ''కళ్యాణీ– చిన్న బ్యాడ్ న్యూస్... నా పెయింటింగ్ పాడయింది.''

''వ్హాట్?''

''అవును కళ్యాణీ. రాత్రి మంచుకి పాడయింది.''

''అస్సలు పనికి రాదా?''

''లాభం లేదు కళ్యాణీ–''

అట్నుంచి కొంచెం నిశ్శబ్దం. ''ఐయామ్ సారీ.''

''ఫర్వాలేదులే.''

''నా కోసం మీరు అలా అంటున్నారు గానీ, అక్కడ చాలా బాధపడుతూ ఉండాలి''.

''కొంచెం బాధ అనిపించింది. కానీ ఏం చేస్తాం?''

(కొనసాగింపు వచ్చే నెలలో)

Click here to share your comments